## విద్యతోనే సామాజిక మార్పు

◆ జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి



విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి

వనపర్తి టౌన్, అక్టోబర్ 7: దేశంలో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన స్ఫూర్తి ప్రదాత ఎస్ఆర్ శంకరన్ అని జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రజావైద్య శాఖ పార్కులో ఎస్ఆర్ శంకరన్ వర్ధంతి సంద ర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే సామాజిక మార్పు సాధ్యమవుతుందని సూచించారన్నారు. నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా, అస్సాం, త్రిపుర రాష్ట్రాల ప్రధాన కార్యదర్శిగా, జాతీయ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా ఎంపికై నిమ్నకులాల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. తుదిశ్వాస దాకా నిరాడంబర జీవితాన్ని గడిపారన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ జేఏసీ నాయకులు రాజారాంప్రకాశ్, గిరిరాజాచారి, నాయకంటి నర్సింహశర్మ, డాక్టర్ మురళీధర్, యేసేపు, వేణుగోపాల్‌నాయుడు, ఖాదర్‌పాషా, వివిధ పార్టీల నాయకులు నాగన్న, రమేశ్, నాగరాజు, సత్తార్, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

వనపర్తి రూరల్, అక్టోబర్7: ప్రజల ఆరోగ్యంపై దృష్టిపెట్టాలని జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కడుకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి శనివారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై డాక్టర్ మౌనికను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కిచ్చారెడ్డి, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రైవేట్ విద్యకు దీటుగా.. ప్రభుత్వ విద్య




మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీధర్

వనపర్తి టౌన్, అక్టోబర్ 7: ప్రైవేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తూ వనపర్తిని జిల్లాను విద్యాపర్తిగా వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పునర్నిర్మాణం చేపట్టారని మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఓరియంటేషన్, స్వాగత కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. వనపర్తిని విద్యాపర్తిగా మహోన్నతంగా ఉండాలని ఇంజినీరింగ్, నర్సింగ్, మెడికల్, ఫిషరీస్, అగ్రికల్చర్ కళాశాలతోపాటు వనపర్తి ఐకాన్ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ వైభవం కోసం విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి జీవితంలో ఉన్నతంగా రాణించి గురువులు, తల్లిదండ్రులు, ప్రాంతానికి మంచిపేరు తేవాలని అందుకు డిగ్రీ దశనే కీలకమన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేశ్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

## పర్యావరణాన్ని కాపాడుదాం

పెద్దమందడి, అక్టోబర్ 7: ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదామని ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సైదయ్య అన్నారు. శనివారం మండలంలోని మోజర్ల ఉద్యాన కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా జ్యూట్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ నిర్మూలించడమే ప్రధాన లక్ష్యమని, ప్లాస్టిక్‌కు బదులుగా ప్రకృతి క్షీణింపదగిన బయోడిగ్రేడబుల్ జ్యూట్ బ్యాగ్‌లను వాడాలన్నారు. ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలన్నారు. అందుకు ప్లాస్టిక్‌ను నివారించి జ్యూట్ బ్యాగులను వాడి భవిష్యత్ తరాలకు మేలు చేకూర్చాలన్నారు. జ్యూట్ బ్యాగ్స్‌ను కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, సెక్యూరిటీ గార్డ్స్, కళాశాలలో పనిచేసే వారికి అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





జ్యూట్ బ్యాగ్స్‌ను పంపిణీ చేస్తున్న అధికారులు

# సీఎం కేసీఆర్ పాలనలో.. గ్రామాలు సస్యశ్యామలం

◆ దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి
◆ మదనాపురం మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అజ్జకొల్లులో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



గోవిందహళ్లిలో ఎమ్మెల్యే ఆల సమక్షంలో పార్టీలో చేరుతున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు

మదనాపురం, అక్టోబర్ 7: సీఎం కేసీఆర్ పాలనలో గ్రామాలు సస్యశామలం అయ్యాయని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అజ్జకొల్లులో రూ.1.50కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్, గోవిందహళ్లిలో రూ.20లక్షలతో జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, రూ.12లక్షలతో నిర్మించిన కామన్ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. దంతనూరులో 2.15కోట్లతో బీటీరోడ్డుకు, రూ.20లక్షలతో జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, రూ.10లక్షలతో ఏర్పాటు చేసిన సీసీరోడ్డను ప్రారంభించారు. కొత్తపల్లిలో రూ.20లక్షలతో జీపీ భవన నిర్మాణం, నెలివిడిలో రూ.20లక్షలతో జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, రూ.3.02 కోట్లతో నిర్మించిన 60 డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రారంభించారు. నర్సింగాపురంలో బీటీరోడ్డు, మన ఊరు-మనబడి, డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రారంభించారు. కొన్నూరులో హెల్త్ సబ్‌సెంటర్, జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ, ద్వారకానగరంలో జీపీ భవన నిర్మాణం, కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో మహిళలకు దసరా కానుకగా బతుకమ్మ చీరలను, క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. అదేవిధంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురు లబ్ధిదారులకు రూ.లక్షా92వేల సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఇటీవలే విడుదలైన కానిస్టేబుల్ ఫలితాల్లో ఉద్యోగం సాధించిన దంతనూరు, తిర్మలాయపల్లి గ్రామాల యువకులను శాలువాలతో సన్మానించి అభినందించారు. విద్యుత్ శాఖలో జేఎల్ఎం ఉద్యోగం సాధించిన అజ్జకొల్లు యువకుడిని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ ఉమ్మడి పాలనలో తాను జెడ్పీటీసీగా ఉన్నప్పుడు కిలోమీటర్ బీటీరోడ్డు వేయలేకపోయానని, నేడు 70గ్రామాల్లో వందల కిలోమీటర్ల బీటీ కూడా రోడ్లు వేసుకోవడం జరిగిందన్నారు. దేవరకద్ర నియోజకవర్గంలో దాదాపు 30 చెక్‌డ్యాంలు నిర్మించామన్నారు. మారుమూల గ్రామాలు, తండాలకు సైతం రవాణా వ్యవస్థను మెరుగుపర్చామని, ఇదంతా సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతోనే సాధ్యమైందన్నారు. ఓట్లు, సీట్ల కోసం ఆరాటపడే కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మొద్దని, మీ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓటేయ్యాలని, ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, దేవరకద్ర ఎమ్మెల్యేగా తనను మూడోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరికలు

మదనాపురం, అక్టోబర్ 7: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గోవిందహళ్లిలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసే క్రమంలో ఎమ్మెల్యే ఆల సమక్షంలో కాంగ్రెస్, బీజేపీకి చెందిన 50మంది కార్యకర్తలు గులాబీ గూటికి చేరారు. వారందరికీ ఎమ్మెల్యే ఆల పార్టీ కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, నాయకులు విష్ణు, రమేశ్, కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఎల్వోసీ అందజేత

కొత్తకోట, అక్టోబర్ 7: మండలంలోని కనిమెట్టకు చెందిన లోకేశ్ కుమారుడు చిరంజీవి నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. వైద్యఖర్చుల నిమిత్తం సీఎం ఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. సీఎంఆర్ఎఫ్ ఉంచి మంజూరైన రూ.2లక్షల50వేల ఎల్వోసీని బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శనివారం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి ప్రశాంత్, మండల ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు శ్రీను ఉన్నారు.

## రెండో ఉత్తమ డిపోగా వనపర్తి



అవార్డు అందుకుంటున్న డిపో మేనేజర్ పరమేశ్వరి

వనపర్తి టౌన్, అక్టోబర్ 7: హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో ఉత్తమ రెండో డిపోగా వనపర్తి నిలిచింది. అప్పటి డిపో మేనేజర్ పరమేశ్వరిని బస్ భవన్‌లో ఆర్టీసీ చైర్మన్ ఎండీ సజ్జనార్ శాలువా, మెమెంటోలతో సన్మానించారు. ఈ సందర్భంగా పరమేశ్వరి మాట్లాడుతూ.. రాఖీ, శ్రావణమాస చాలెంజ్‌లో భాగంగా ఏప్రిల్ 23నుంచి సెప్టెంబర్ 23వరకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ డిపోగా వనపర్తి డిపో రెండోస్థానం నిలవడం గర్వంగా ఉందని, అందుకు సహకరించిన సీవ చంద్రమౌళి, కంట్రోలర్, ఏడీసీలకు ధన్యవాదాలు తెలిపారు.

# మహిళా బంధువు సీఎం కేసీఆర్

ఆత్మకూరు, అక్టోబర్ 7: సీఎం కేసీఆర్ మహిళా బంధువని, వారి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రీయాదవ్ అన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ వార్డుల మహిళలకు బతుకమ్మ చీరలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, బీఆర్ఎస్ అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

### ఆడపడుచుల ఆనందానికే బతుకమ్మ చీరలు

అమరచింత, అక్టోబర్ 7: తెలంగాణలో బతుకమ్మ పండుగను ఆడపడుచులు సంతోషంగా జరుపుకోవాలనే ప్రభుత్వం ప్రతి ఇంట్లోని మహిళలకు బతుకమ్మ చీరలను అందజేస్తున్నదని మున్సిపల్ కమిషనర్ మహ్మద్‌ఖాజా పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని వివిధ వార్డుల్లో మున్సిపల్ కౌన్సిలర్లు, మహిళా సంఘాల ఆర్పీలతో కలిసి మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు లక్ష్మి, సింధూ, ఆర్పీలు ఖాజా, గోపాల్, కమల, రాజేశ్వరి, సంగీత ఉన్నారు.

### పాన్‌గల్ మండలంలో..

పాన్‌గల్, అక్టోబర్ 7: రాష్ట్ర ప్రభుత్వం దసరా కానుకగా ఆడపడుచులకు బతుకమ్మ చీరలను అందిస్తున్నదని సింగిల్‌విండో చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కేతేపల్లిలో అర్హులైన మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. దసరా, రంజాన్, క్రిస్మస్ పండుగలకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తుందని తెలిపారు. అదేవిధంగా మాందాపూర్‌లో సర్పంచ్ జయరాములు సాగర్ మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిత, ఎంపీటీసీ శ్యామల, పంచాయతీ కార్యదర్శి హరిత, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, హనుమంతరెడ్డి, శ్రీనివాసులునాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ బీరయ్య పాల్గొన్నారు.



ఆత్మకూరులో చీరలు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్



అమరచింతలో చీరలను అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్



కేతేపల్లిలో చీరలు అందజేస్తున్న విండో చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి